# బీటీయే భేష్

- కన్సార్టియం ఆఫ్ ఇండియన్ ఫార్మర్స్ సెక్రటరీ జనరల్ పెద్దిరెడ్డి చెంగల్‌రెడ్డి
- బీటీ వంకాయను గుడ్డిగా వ్యతిరేకించొద్దు
- హరిత విప్లవం తర్వాత బీటీతోనే రైతుకు లాభాలు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: బీటీ వంకాయకు జెనెటిక్ ఇంజనీరింగ్ అండ్ అప్రూవల్ కమిటీ (జీఈఏసీ) ఆమోదం లభించడంతో భారత్‌లో వాణిజ్యపరంగా దాని ఉత్పత్తికి ద్వారాలు తెరుచుకున్నట్లయింది. మిగతా లాంఛనాలన్నీ పూర్తయి, జన్యుపరివర్తిత ఆహార పంటలను దేశవ్యాప్తంగా పలు రైతు సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు వ్యతిరేకిస్తున్నాయి. దీనికి భిన్నంగా.. రెండువేల రైతు సంఘాలకు ప్రాతినిధ్యం వహించే కన్సార్టియం ఆఫ్ ఇండియన్ ఫార్మర్స్ సెక్రటరీ జనరల్ పెద్దిరెడ్డి చెంగల్‌రెడ్డి బీటీ వంకాయను గుడ్డిగా వ్యతిరేకించవద్దని అంటున్నారు. బయో ఏషియా సదస్సులో పాల్గొన్న ఆయన బుధవారం 'న్యూస్‌లైన్'తో మాట్లాడుతూ.. తమ కన్సార్టియంలోని రైతు సంఘాలన్నీ బీటీ వంకాయకు మద్దతిచ్చినట్లు తెలిపారు. ప్రభుత్వం అనుమతిస్తే ముందుగా కొద్దిగా సాగు చేస్తామని చెప్పారు. లాభసాటి అనిపిస్తే రెండు మూడేళ్ల తర్వాత పూర్తిస్థాయిలో సాగు చేస్తామన్నారు. "హరిత విప్లవం తర్వాత అంతే స్థాయిలో రైతుకు ఆర్థిక ఫలితాలు వచ్చింది బీటీ కాటన్‌లోనే. ప్రత్తి సాగులో భారతీయ రైతులు అమెరికాను అధిగమించారు. వేలాది కోట్లు ఆర్జించగలిగాం. బయోటెక్నాలజీ ద్వారా దేశంలో రైతు రూపు రేఖలు మారబోతున్నాయి. చైనాలో వరి, సోయా, పెరూలో బంగాళా దుంపలు బీటీ ఆధారంగా పండిస్తున్నారు. అక్కడంతా బాగానే ఉంది. విదేశాల్లో దీన్ని వ్యతిరేకిస్తున్నారని కొందరు తప్పుదారి పట్టిస్తున్నారు. అమెరికా, కెనడా, బ్రెజిల్, ఆస్ట్రేలియా, చైనాలాంటి వ్యవసాయ దేశాల్లో బీటీపై వ్యతిరేకత లేదు. రాజకీయ ప్రయోజనాల కోసమే కొన్ని సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి. రైతు ప్రయోజనాలు కోరేవారెవరూ బీటీ వంకాయను వ్యతిరేకించరు. రైతులు కూడా లాభసాటిగా ఉంటేనే పండిస్తారు. కొనుగోలుదారులు లేకపోతే సాగు చేయం. రెండు మూడేళ్లలో దీనిపై అందరికీ పూర్తి అవగాహన రావచ్చు. స్వచ్ఛంద సంస్థలు దీనిని వ్యతిరేకించటం రైతు శ్రేయస్సు కోరి కానేకాదు. మార్కెట్ యార్డుల్లో రైతుకు సరైన రేటు దొరకనప్పుడు ఈ సంస్థలు మాట్లాడవు. రైతు ఆత్మహత్యలపై స్పందించరు. వ్యవసాయ రంగానికి తగినంత బడ్జెట్ కోసం పోరాడరు. వీటికి తోడు 'రాజకీయ రైతులు'... అధికారంలో ఉంటే కావాలంటారు. ప్రతిపక్షంలో ఉంటే వ్యతిరేకిస్తారు. అందువల్ల వీరినెప్పుడూ పరిగణనలోకి తీసుకోకూడదని నా మనవి." అని చెప్పారు.